క్లుప్తంగా

బొకేలు, శాలువలు వద్దు

చిత్తూరు కార్పొరేషన్: నూతన సంవత్సరం రోజున శుభాకాంక్షలు తెలపడానికి వచ్చేటప్పుడు పూలమాలలు, బొకేలతో రావొద్దని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి తెలిపారు. న్యూఇయర్ రోజున పార్టీ క్యాడర్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తనను కలిసేందుకు వచ్చేటప్పుడు వారు సాదరంగా రావాలని, లేదంటే స్కూల్ బ్యాగ్స్, పుస్తకాలు తీసుకురావాలన్నారు. ఆ విద్యాసామగ్రి పేదపిల్లలకు ఉపయోగపడుతుందని వివరించారు.

అంధత్వ నివారణే లక్ష్యం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అంధత్వ నివారణే లక్ష్యంగా జైన్ సంఘం పనిచేస్తోందని నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు. చిత్తూరు నగరం రాములుగుడి వీధిలోని జైన్ సంఘ మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్‌వీ అరవింద్ ఐ ఆస్పత్రి డాక్టర్లు శిబిరంలో పాల్గొన్న 93 మందికి కంటి పరీక్షలు చేశారు. అందులో 27 మంది ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. కార్యక్రమంలో నిర్వాహకులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి స్పందన జరుగుతుందని.. ప్రజల ఫిర్యాదులు స్పందనలో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి


మాట్లాడుతున్న మత్స్యకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి


చౌడేపల్లె: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనిచ్చి జీవనోపాధి కల్పించడానికి కృషి చేయాలని జిల్లా మత్స్యకారుల సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండు చేశారు. ఆదివారం కాటిపేరిలో బెస్త కులస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో నూతన మత్స్యకారుల సహకార సంఘాన్ని ఏర్పాటు చేశారు. కాటిపేరికి చెందిన నవీన్‌కుమార్ సంఘ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ, జిల్లా మత్స్యకార సహకార సంఘంలో 18నుంచి 45 ఏళ్లలోపు ఉన్నవారు సభ్యులుగా చేరాలన్నారు. కుల వృత్తిని ప్రభుత్వం ప్రోత్సహించి చెరువుల్లో చేపలు పెంచుకునే హక్కును కల్పించి ప్రోత్సహించాలని, ఆ దిశగా ఆ శాఖ కమిషనర్, జిల్లాకలెక్టర్లు ఆదేశాలివ్వాలన్నారు. గ్రామాల్లో అర్హులైన వారు సంఘాల్లో సభ్యులుగా చేరి ఆర్థిక ప్రోత్సాహంతోపాటు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా సంఘాలు ఏర్పాటుచేసి అర్హులకు లబ్ధి చేకూరేలా చైతన్యం కల్పిస్తామన్నారు. సమావేశంలో బెస్త సంఘం మండలాధ్యక్షుడు కృష్ణప్ప, నాయకులు కేవీ.ఆనంద్‌కుమార్, వెంకట్రమణ, ప్రభాకర్, రవికుమార్, జ్యోతికుమార్ పాల్గొన్నారు.

నేడు మాలల మహాగర్జన


పోస్టర్లు విడుదల చేస్తున్న అశోక్ తదితరులు

పుంగనూరు: స్థానిక బీఎంఎస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించనున్న మాలల మహాగర్జనకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఆర్ అశోక్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో సంఘ ప్రతినిధులతో కలసి ఆయన పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చేయాలని ఇచ్చిన తీర్పును తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. విభజనతో మాలల హక్కులు కోల్పోతారని ఆయన పేర్కొన్నారు.. మాల మహానాడు సభలతో ప్రభుత్వాలకు తమ ఐక్యత, నిరసనను తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ సభలకు రాష్ట్ర ప్రతినిధులు హాజరవుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులురెడ్డి, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

నియామకం


మునీంద్ర నాయక్

పుంగనూరు: మండలంలోని సుగాలిమిట్టలో నివాసం ఉన్న డాక్టర్ బాణావత్ మునీంద్ర నాయక్‌ను జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు పంపారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాల సమస్యలపై ఎప్పటికప్పుడు అధికారులతో చర్చించి, పరిష్కరించేందుకు కృషి చేస్తామని మునీంద్ర నాయక్ తెలిపారు.


గుడిపాల: నరహరిపేట సంతలో ఉల్లిపాయల విక్రయం

కొత్త సంవత్సరంలోకి అడుగిడుతున్న వేళ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతుండగా..కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. ఇక ఉల్లి ధర వింటేనే ఘాటు కొడుతోంది. కర్నూలు, పుణె నుంచి ఉల్లి రవాణా లేకపోవడం.. వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడంతో ఉల్లికి గిరాకీ ఏర్పడిందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. రానున్న రోజుల్లో మరింత డిమాండ్ ఏర్పడే అవకాశం ఉందని చెబుతున్న నేపథ్యంలో సామాన్యులకు ఇక్కట్లు తప్పేలా లేవు.

ఉల్లి అధరహో



- అమాంతం పెరిగిన నిత్యావసర సరుకులు, కూరగాయలు
- వారంలోనే కిలో రూ.50 నుంచి రూ.70కి ఎగబాకిన ఉల్లి
- ధరల నియంత్రణలో చేతులెత్తేసిన కూటమి సర్కారు
- సంక్రాంతి వరకు ఇదే పరిస్థితి అంటున్న వ్యాపారులు
- కొత్త సంవత్సర వేళ పేద, మధ్య తరగతి ప్రజలకు తప్పని బాధలు

గుడిపాల: నిత్యావసర ధరలను నియంత్రిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. మరోవైపు కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో సగటు సామాన్యులు ఏవీ కొనలేం .. తినలేం..అనే పరిస్థితిలో ఉన్నారు. మరోవైపు ఉల్లి ధరలు వింటేనే ఘాటు కొడుతోంది. 15 రోజుల క్రితం వరకు మార్కెట్‌లో నాణ్యమైన ఉల్లి కిలో రూ.50 ఉండగా ప్రస్తుతం రూ.70 పలుకుతోంది. ముస్ముందు ఈ ధర మరింత పెరగవచ్చని వ్యాపారులు అంటున్నారు.

వారం రోజుల్లోనే..

వారంరోజుల్లోనే ఉల్లి ధర కిలోపై రూ.20 పైగా పెరిగింది. ప్రధానంగా ప్రతి ఇంట్లోనూ ఉల్లి వినియోగం ఎక్కువగా ఉంది. జూలై నాటికి దేశంలోని మార్కెట్లలో ఉల్లి సరఫరా నిలిచిపోతుంది. ఏటా ఆగస్టు, సెప్టెంబర్ నెలల కాలంలో ఉల్లి ధరలకు రెక్కలు వస్తాయి. ప్రధానంగా కర్నూలు, పుణెలో ఉల్లిసాగు తగ్గడం, వర్షాభావం వల్ల ఉల్లి ధర పెరగడానికి కారణమైతే, ఉల్లి వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలను శాసించడం మరో కారణం. దీంతో ఉల్లి కొనుగోలుకు మధ్య తరగతి, పేద ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

పెరుగుతున్న ధర..

ఇప్పటికీ కర్నూలు రకం కిలో ఉల్లి ధర మార్కెట్‌లో రూ.45 నుంచి 50 ఉండగా, తాజాగా ఇది రూ.70కి చేరింది. మహారాష్ట్ర నుంచి వచ్చే ఉల్లిని గ్రామాల్లో చిల్లర వర్తకులు రూ.70నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు.

జనవరి తొలివారంలో..

వరదల ప్రభావంతో ఉల్లి ధర పెరిగిందని, ప్రస్తుతం ఉల్లి పంట నార్లు ప్రారంభమయ్యాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో డిసెంబర్ నెలాఖరులో కానీ, జనవరి తొలివారంలో కానీ కొత్త సరుకు మార్కెట్‌కు వచ్చే అవకాశం లేదని విశ్లేషిస్తున్నాయి. కర్నూలు ఉల్లి పాయలు ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉండగా, షోలాపూర్ సరుకు కొద్దికొద్దిగా దిగుమతి అవుతోంది.

సమన్వయ లోపంతో..

పౌరసరఫరాల శాఖ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖల మధ్య సమన్వయ లోపంతో ఉల్లి పాయలను అమ్మలేక చేతులెత్తేశామని పలువురు వినియోగదారులు మండిపడుతున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లిపాయలను కొనుగోలు చేసి, ప్రజలకు తక్కువ ధరకు విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. సంక్రాంతి నాటికి ఉల్లిధర సాధారణ స్థాయికి వచ్చే అవకాశం ఉందని, అప్పటి వరకు అధిక ధరలు తప్పవని వ్యాపారులు చెబుతున్నారు.

ధరను నియంత్రించాలి..



పనుల్లేక జనం ఇబ్బందులు పడుతున్నారు. జనం చేతిలో చిల్లిగవ్వలేని పరిస్థితి. మరోవైపు రోజురోజుకు పెరుగుతున్న ఉల్లిపాయలు, కూరగాయలు, నిత్యావసర ధరలతో సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ధరలను నియంత్రించాలి.

– రెడ్డెప్ప, మాజీ సర్పంచ్, వసంతాపురం, గుడిపాల

ఆచీతూచీ కొంటున్నాం..



ఉల్లి ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దీంతో పాటు ఇతర కూరగాయల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. ఉల్లి ధర రెట్టింపు కావడంతో ఆచీతూచీ కొనుగోలు చేయాల్సి పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం సబ్సిడీపై రేషన్‌షాపుల్లో ఇప్పించాల్సిన అవసరం ఉంది.

–లలిత, వసంతాపురం గుడిపాల

ఘనంగా పదవీ విరమణ మహోత్సవం

కాణిపాకం: కాణిపాకంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం స్కూల్ అసిస్టెంట్, పీఆర్‌టీయూ అధ్యక్షుడిగా పనిచేసిన ప్రకాష్‌రెడ్డి పదవీ విరమణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ సంఘ నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని పేర్కొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని ఆస్థాన మండపంలో ఆదివారం ఆయుర్వేద మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపునకు ప్రజల నుంచి భక్తులు, ఆలయ సిబ్బంది నుంచి విశేష స్పందన లభించింది. 150 మంది పరీక్షలు చేయించుకుని, ఆయుర్వేద మందులు అందుకున్నారు. కార్యక్రమంలో ఏఈఓ క్రిష్టారెడ్డి తదితరులు ఉన్నారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్‌గా రవిరాజు

కాణిపాకం: ఏలూరులో ఆదివారం జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్‌గా జిల్లా వాసి డాక్టర్ రవిరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వహణ అధికారిగా వ్యవహరించిన కమాల్‌బేడీ అందరి సమక్షంలో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఎన్నిక పత్రం అందజేశారు. ఆయన వాకర్స్, వైద్య రంగంలో అందించిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలను అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి హానికరం



ఐరాలలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఐరాల: ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి ఎంతో హానికరమని తిరుపతి ఎస్‌వీ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లావణ్య అన్నారు. మండలంలోని 35 యర్లంపల్లెలో ఆదివారం చిత్తూరు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో ×సే నో టు ప్లాస్టిక్‌×పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఎస్‌వీ వ్యవసాయ కళాశాల తిరుపతి ప్రొఫెసర్ వై.రెడ్డి రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్డిరాము మాట్లాడుతూ ప్రజలు వాడే ప్లాస్టిక్ కారణంగా జీవరాశికి ప్రమాదం ఏర్పడుతోందన్నారు. ప్లాస్టిక్ భూమిలో కలవకపోవడంతో పర్యావరణ దెబ్బతింటుందని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగించడం ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతిని మానవాళి భవిష్యత్తు ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉందన్నారు. పార్థీనియం మొక్క నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలో కాలుష్య నివారణ, మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నివారణ, బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సూచిక బోర్డు ఏర్పాటు చేయాలి


బంగారుపాళెం: కరిడివారిపల్లె వద్ద ఎస్ ఆకారంలో మలుపురోడ్డు

బంగారుపాళెం: మండలంలోని అరగొండ–బంగారుపాళెం రహదారి కరిడివారిపల్లె సమీపంలోని మలుపు రోడ్డు వద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు. ఈ రహదారి మీదుగా చాలా మంది ప్రయాణికులు వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి పౌర్ణమి రోజు అర్ధగిరి ఆంజనేయ స్వామివారిని, కాణిపాకం వినాయక స్వామివారిని దర్శించుకునేందుకు వెళ్తుంటారు. కరిడివారిపల్లె సమీపంలో ఎస్ ఆకారంలో మలుపు రోడ్డు ఉండడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉంది.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తవణంపల్లె: ప్రజా సమస్యల పరిష్కార వేదిక తవణంపల్లె మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని రావడానికి ఇది మంచి వేదిక అన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐరాలలో..

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు. కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజల తమ సమస్యలను అర్జీల ద్వారా తెలియజేయాలన్నారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు.

యూటీఎఫ్ పతాకావిష్కరణ



గాంధీ విగ్రహం వద్ద కార్యక్రమంలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: వచ్చే ఏడాది జనవరి 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే స్వర్ణోత్సవ సభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ అన్నారు. ఈ మేరకు ఆదివారం గాంధీ విగ్రహం వద్ద సంఘ నాయకులు యూటీఎఫ్ పతాక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తి కావడంతో రాష్ట్రస్థాయి స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాకినాడలో జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి చేపట్టాల్సిన అంశాలను చర్చించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రస్థాయి కార్యక్రమానికి జిల్లాలోని యూటీఎఫ్ నేతలు, టీచర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖరనాయుడు, మణిగండన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు దిగువమోదలపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

తవణంపల్లె: మండలంలోని దిగువమోదలపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరుగుతుందని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. దిగువమోదలపల్లె పంచాయతీలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హెల్మెట్ మనిషికి రక్షణ కవచం

తవణంపల్లె: రక్షణ కవచంలాంటి హెల్మెట్‌ను ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరు ధరించాలని తవణంపల్లె హెచ్‌సీ గజేంద్ర తెలిపారు. ఆదివారం సాయంత్రం తవణంపల్లెలో ద్విచక్రం వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడపడంతో జరిగే ప్రమాదాల్లో నిండు ప్రాణాలు క్షణంలో గాలిలో కలుస్తున్నాయని వివరించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు చేపట్టడంతో పాటు జైలుకు పంపుతామని హెచ్చరించారు. రోడ్డు భద్రత నియమాలను పాటించాలని అన్నారు. ద్విచక్ర వాహనం దారులు హెల్మెట్ తప్పక వాడాలని లేనిచో అపరాధం విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీసీ కెమెరాల వినియోగంపై అవగాహన కల్పించారు.

గోసంరక్షణ ట్రస్టుకు విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన గోసంరక్షణ ట్రస్టుకు ఆదివారం నగదు విరాళంగా అందింది. కృష్ణాజిల్లాకు చెందిన దాత సీతారాం ప్రసాద్ రూ.ఒక లక్ష నగదును విరాళంగా ఇచ్చారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ అధికారులు స్వామి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది వాసు, చిట్టిబాబు పాల్గొన్నారు.

వేడుకగా పటం పూజ


పూజలు చేస్తున్న గోవిందమాల భక్తులు

చౌడేపల్లె: మండలంలోని ఎస్.అగ్రహారంలో గోవిందమాల ధరించిన భక్తుల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పటం పూజ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ రుక్మిణీ సమేత సత్యభామ వేణుగోపాలస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని పూలు, విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆనందాచార్యుల ఆధ్వర్యంలో గ్రామస్తులు, గోవిందమాల భక్తులు, మహిళలు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. గోవింద నామస్మరణలతో పరిసర ప్రాంతం మార్మోగింది. అనంతరం అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

బంగారు గొలుసుల అపహరణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో చైన్‌స్నాచింగ్ జరిగింది. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు.. గంగాధర నెల్లూరు మండలం కొత్రకోన గ్రామానికి చెందిన హంసవేణి తన చెల్లెలితో కలిసి బైక్‌పై ఆదివారం దొడ్డిపల్లె వైపు వస్తుండగా.. ఓ బైకులో వచ్చిన ముగ్గురు యువకులు, చిత్తూరుకు ఎటువైపు వెళ్లాలని వారిని అడిగారు. ఆమె అడ్రస్ చెబుతుండగానే వెనుక కూర్చున్న మరో ఇద్దరు వ్యక్తులు ఆ మహిళల మెడలో ఉన్న బంగారు గొలుసులను లాక్కుని పారిపోయారు. సుమారు 62 గ్రాముల రెండు బంగారు గొలుసులు అపహరించుకుని వెళ్లడంపై బాధిత మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ జయరామయ్య తెలిపారు.

నేడు శివాలయంలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీకామాక్షీ సమేత స్వయంభు మొగిలీశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం రాహు కాల సమయం ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల మధ్య రాహుకేతు, సర్ప దోషనివారణ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం ఆలయంలో రాహుకేతు పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని దోష నివారణ చేసుకోవాలని కోరారు.

కొత్త ఆలోచనలతో ముందడుగు వేయాలి


చీరలు పంపిణీ చేస్తున్న చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్(కాణిపాకం): కొత్త సంవత్సరంలో సరికొత్త ఆలోచనలతో ముందడుగు వేయాలని వైఎస్ఆర్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి అన్నారు. క్రిస్మస్, కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరం చెన్నమ్మగుడిపల్లిలోని చర్చిలో ఆదివారం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. కొత్త సంవత్సంలో అందరికీ మంచి జరగాలని దేవున్ని ప్రార్థిస్తున్నానన్నారు. కార్యక్రమంలో చర్చి నిర్వాహకులు ప్రసాద్, జాషువా, ధనరాజ్, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభాషే జాతికి జీవధార


పోస్టర్ల ఆవిష్కరణలో రచయితల సమాఖ్య సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తెలుగుభాషే నాగరిక జాతికి జీవధార అంటూ భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ గౌరవాధ్యక్షుడు మర్రిపూడి దేవేంద్రరావు అన్నారు. చిత్తూరు నగరంలోని సమాఖ్య కార్యాలయంలో తెలుగుభాష వైభవానికి తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు కృషి చేయాలని కోరుతూ రూపొందించిన పోస్టర్లను తెలుగు భాషాభిమానులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో బోధన–పాలన వ్యవహారాలలో తెలుగుభాషకు గౌరవం కల్పించి, ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు ఆ ఒరవడే కల్పిస్తే భాషకు పూర్వ వైభవం లభిస్తుందన్నారు. మాతృభాషకై ఉద్యోగ భద్రత కల్పిస్తున్న తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రను తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వచ్చే ఏడాది నుంచి ప్రాథమిక స్థాయి నుంచి పీజీ వరకు తెలుగు మాధ్యమాన్ని నిర్బంధంగా కొనసాగించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భాషాభిమానులు కోటీశ్వర మొదలియార్, మునీంద్ర, ఆనందనాయుడు, మొహిద్దీన్ అలీ, ఎం.జె.భాస్కర్ రెడ్డి, షణ్ముగం, భూపతి, డి.రోహిత్, ముబారక్, టి.మంజులాదేవి, నాగరాజ, ప్రవళ్లిక, శావంత్, భువన్ చంద్, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

చిత్తూరు కలెక్టరేట్: ''అధికారం ఎవరికీ శాశ్వతం కాదు.. అధికారం ఉంది కదా అని జాటీతో గుర్రాన్ని కొడుతూ ఉంటే అది తన్నే రోజు కూడా వస్తుంది'' అని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. నగరంలోని మురగానపల్లిలో ఉన్న న్యూయార్క్ సీబీఎస్‌ఈ పాఠశాలలో నిర్వహించిన రాయల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ (రేవా) 3వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ ఆర్నెళ్లలో రాజకీయాల్లో ఎన్నో గుణపాఠాలు, అనుభవాలు వచ్చాయన్నారు. కులాన్ని ప్రేమించలేని వారు ఇంకేమీ చేయలేరన్నారు. కుల సంఘాల సమావేశాల్లో పాల్గొనేందుకు అధికారులు భయపడకూడదన్నారు. రేవా సంస్థ ప్రతినిధుల కోరిక మేరకు భవనం మంజూరుకు చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు. అనంతరం 2023–24 విద్యాసంవత్సరంలో ప్రతిభ చాటిన పది, ఇంటర్ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ కఠారి హేమలత, రేవా సంఘం అధ్యక్షుడు పీఎంఆర్ ప్రభాకర్, కార్యదర్శి దేవినేని మోహనకృష్ణ, సభ్యులు వెంకటేష్, డీఆర్‌డీఏ పీడీ తులసి, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య, ఐఅండ్‌పీఆర్ డీడీ పద్మజ పాల్గొన్నారు.